# బొంకు నేర్చినమ్మ



*యది వదంతి మృషాగిర మంగనా*
*మతి మతామపి సా భువి భిత్తివత్*
*యది పునః పురుషాః ప్రవదన్త్యమూం*
*యవనికేవ భవేదియ మన్మృతిః*

***భావం:*** ఎంత తెలివైన వారితోనైనా స్త్రీ చెప్పిన అబద్ధం గోడవలె గట్టిగా ఉంటుంది. అదే మగవాడు చెప్పిన అబద్ధం తెరలా కదిలిపోతుంది.

కొంతకాలం కిందట పాశ్చాత్య దేశాలలో సామాజిక శాస్త్రవేత్తలూ, మనస్తత్వ శాస్త్రవేత్తలూ కలిపి పరిశోధనలు చేసి మగవారిలో నలభై ఆరు

శాతం మందికీ, స్త్రీలలో పదహారు శాతం మందికీ వివాహేతర సంబంధాలున్నాయని లెక్కకట్టారు. ఆ లెక్కల వలన పురుషులలో స్త్రీలలోకన్నా వ్యభిచరించే గుణం ఎక్కువని తేల్చారు.

ఈ పరిశోధనలు చదివిన గణిత శాస్త్రజ్ఞులూ, గణాంక వేత్తలూ తలలు పట్టుకున్నారు. ఒక మగవాడు సంబంధంపెట్టుకున్నాడంటే అతనికి ఒక మహిళ దొరకాలి కదా? ఎ=బి వంటి ఈక్వేషన్సు మాత్రమే తెలిసిన వారికి మహిళల సంఖ్యా, మగవారి సంఖ్యా ఎందుకు సమం కాలేదో తెలియలేదు. పరిశోధన తప్పని వీరూ, కాదని వారూ వాగ్యుద్ధాలు చేసుకున్నారు. అటువంటి వారికే ఈ కథ.

ఒక సుందరాంగి భర్త విదేశాలలో వ్యాపారానికై వెళ్ళాడు. ఒంటరితనంతో విసుగెత్తిన ఆమె ఒక పురుషుడితో పరిచయం పెంచుకుని హాయిగా సమయం గడపసాగింది.

కథ అక్కడతో ఆగలేదు. కొన్నాళ్ళకి ఆమెకు ఆ పురుషుడితో విసుగొచ్చింది. అతణ్ణి వదిలేసి ఇంకొకడితో స్నేహం ప్రారంభించింది. మొదటి ప్రియుడికి ఈ విషయం బాధని కలిగించింది. ఒకరోజు రాత్రి ఆమె ఇంట్లో ప్రవేశించి ఆమె నిద్రపోతున్నప్పుడు జుట్టు మొత్తం కోసేశాడు. పూర్తిగా గుండు అయిపోతే ఆమెను రెండో ప్రియుడు వదిలేస్తాడని అతని నమ్మకం.

అయితే తెల్లారేసరికి ఆమె భర్త లాభాలతో వచ్చాడనీ, గ్రామ పెద్దలతో మాట్లాడి ఇంటికి వస్తాడనీ తెలిసింది. ఏం చెయ్యాలా అని ఆమె ఆలోచించ సాగింది.

భర్త వచ్చాడన్న వార్త ఆమె మొదటి ప్రియుడికీ తెలిసింది. తమ అక్రమ సంబంధమూ, తాను జుట్టు కోసేసిన సంగతీ చెప్తుందేమోనని అతను భయపడ్డాడు.

కానీ భర్త ఊళ్ళో లేనప్పుడు ఇద్దరు ప్రియులతో హాయిగా గడిపిన ఆమె తానే రచ్చబండ దగ్గరకు వెళ్ళింది. భర్త కాళ్ళు కడిగి నీళ్ళు నెత్తిమీద చల్లుకుని, పాదాలకు పూలతో పూజ చేసి, " నాథా, మీరు క్షేమంగా తిరిగి రావాలని కోరుకుంటూ ఉంటే నిన్న రాత్రి మీకు ప్రాణగండముందనీ, నేను జుట్టు దేవుడికి సమర్పిస్తే ఆ గండం పోతుందనీ కల వచ్చింది. ఉదయమే జుట్టు తీసేసుకున్నాను. మీరు క్షేమంగా వచ్చారు. మన్నించండి" అంది.

తనపై ప్రేమతో స్త్రీలకు ప్రాణప్రదమైన జుట్టు కూడా తీసేసుకుందని ఆమె భర్తా, తనకు దేహశుద్ధి తప్పిందని ఆమె మొదటి ప్రియుడూ సంతోషించారు.

.... నేర్చినమ్మ బొంకు నేర్వదా అని మోటు సామెత. ఈ కథ చదివితే పరిశోధకుల సందేహాలన్నీ తీరతాయేమో.

******